క్లుప్తంగా

'గోకులం'లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

మలికిపురం: గోకులం పథకంలో లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని లక్కవరంలో రుద్రరాజు గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కోసం పశువుల పెంపకం, కోళ్ల పెంపకానికి గోకులం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు అనుసరించి ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 50 శాతం లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉండగా క్షేత్ర స్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలను విస్మరించడం మంచి పద్ధతి కాదన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సురేష్

మలికిపురం: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని మలికిపురం ఎస్సై పీవీవీఎస్ సురేష్ సూచించారు. స్థానిక ఎంవీఎన్ జేఎస్ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గంజాయి బారిన పడుతున్న యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిత్యం వారి కదలికలను గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ ఎస్.ఆనందమహానీ అధ్యక్షత వహించగా, తహసీల్దార్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాల బారిన పడితే జీవితం సర్వనాశనమవుతుందని, వాటి జోలికి వెళ్లవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గెడ్డం తులసీభాస్కర్, శివ, రెవెన్యూ ఆఫీసర్లు హరి, గ్రామ సెక్రటరీ ఇంజేటి శుభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నక్క రమేష్ బాబు, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడికుదురులో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

మామిడికుదురు: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానం శిబిరం జరిగింది. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 20 మంది దాతలు రక్తదానం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ రక్తదానం శిబిరం ఏర్పాటు చేశామని ఆ సంఘం సభ్యులు తెలిపారు.

కులగణన కోరుతూ దీక్ష



ఒక రోజు దీక్షలో పాల్గొన్న మండల మాలల న్యాయపోరాట సమితి ప్రతినిధులు

మామిడికుదురు: కులగణన అమలు చేయాలని కోరుతూ మాలల న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఒక రోజు దీక్ష నిర్వహించారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద టెంట్ వేసి దీక్ష చేశారు. కుల గణన జరిగే వరకు వన్‌మన్ కమిషన్‌ను రద్దు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 400 మంది దళితులపై ప్రభుత్వ దాడులు జరిగాయని వాటిపై వెంటనే విచారణ జరిపించాలని, క్రిమి లేయర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, భూపతి వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

అమలాపురం రూరల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్జీలపై ముందుగా అర్జీదారునికి ఫోన్ చేసి, క్షేత్ర స్థాయిలో విచారణకు వెళ్లాలని ఆదేశించారు. సమస్యకు నాణ్యతతో పరిష్కార మార్గం చూపాలన్నారు. ఇకపై అర్జీల విచారణ, పరిష్కారం, అప్లోడింగ్ ప్రక్రియల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. మెమోలిచ్చి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత జిల్లా యువ ఉత్సవ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు ఉత్సవ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి సర్వం సిద్ధం

- ముస్తాబైన పురాతన కడలి క్షేత్రం
- నేడు వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన అధికారులు
- నేటి నుంచి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం



కపోతగుండాన్ని ఆనుకుని ఉన్న ప్రసిద్ధ కపోతేశ్వరాలయం

రాజోలు: విశ్వంలో ప్రతి అణువు శివతత్వంతో ఇమిడి ఉందనే పరమతత్వాన్ని మానవులకు, పశుపక్ష్యాదులకు కడలి కపోతేశ్వర క్షేత్రం ప్రబోధిస్తుంది. బ్రహ్మాండ పురాణంలో గౌతమీ మహాత్యంలో కడలి క్షేత్రం విశిష్టత వివరించారు. అటువంటి పురాణ ప్రసిద్ధి చెందిన కడలి కపోతేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 7.15 గంటలకు శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణ్యంతో షష్ఠి ఉత్సవాలకు శ్రీకారం జరుగుతుంది. 7న స్వామి వారి తీర్థం, మధ్యాహ్నం మూడు గంటలకు సర్ప వాహనంపై గ్రామోత్సవం, 8న రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారికి పవళింపు సేవ నిర్వహిస్తారు.

ఆలయ విశిష్టత

కపోతం అంటే పావురము. ఈ క్షేత్రంలో పావురాల జంట రూపంలో స్వయంభూ శివలింగం వెలసింది. ఈ శివలింగంపై కపోతాల రెక్కల ఆకృతి స్పష్టంగా దర్శనమిస్తోంది. క్రీ.శ. 15, 16 శతాబ్దంలో పల్లవులు ఈ ఆలయాన్ని నిర్మించారని నాగర లిపిలో రాసి ఉన్న శిలా శాసనం ఇక్కడ ఉంది. రెండు కపోతాలు, ఒక వేటగాడు ప్రాణత్యాగానికి ప్రతీకగా శివుడు ఈ ప్రాంతంలో వెలసినట్టు పురాణగాథ. బోయవాడు స్వామికి సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్టుగా శిలారూపం ఉంది. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ప్రతి మంగళవారం అభిషేకాలు నిర్వహించి భక్తులకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

కపోత గుండంలోకి అంతర్వాహినిగా గంగా

ఆలయానికి ఆనుకుని ఉన్న గుండం(చెరువు)లోకి ప్రతీ మాఘమాసం ఆదివారం నాడు కాశీ నుంచి గంగాజలం అంతర్వాహినిగా వచ్చి కపోతగుండంలో కలుస్తుందని భక్తుల విశ్వాసం. ఆ రోజున ఆ గుండంలో(చెరువు) మారేడు పత్రాలు వేస్తే మునిగిపోతాయని అర్చకులు వివరిస్తున్నారు. అప్పుడు కపోత గుండంలో స్నానమాచరించి కపోతేశ్వరుని దర్శిస్తే



శ్రీకపోతేశ్వరస్వామి వారు

మోక్షం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఆది శంకరాచార్యులు ఈ క్షేత్రాన్ని దర్శించి శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ 18 శుక్రవారాలు అమ్మవారిని క్రమం తప్పకుండా మహిళలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు.

ఒకే పీఠంపై శివుడు, నాగేంద్రుడికి పూజలు



గర్భాలయంలో ఉత్తరాభిముఖంగా ఆవిర్భవించిన స్వామికి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి తన పడగలతో నీడపట్టారు. అందుకే ఈ క్షేత్రంలో సుబ్రహ్మణ్య స్వామి నాగేంద్రుని రూపంలో కొలువుదీరడంతో శివుడు, నాగేంద్రుడికి ఒకే పీఠంపై నిత్య పూజలు జరుగుతాయి. నిత్యం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రతి మాస శివరాత్రికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహిస్తాం.

– కాకాని వెంకట సత్యకృష్ణకుమార్, ప్రధాన అర్చకుడు

క్షేత్ర పాలకుడు జనార్దనుడు

కపోతేశ్వరస్వామి ఆలయానికి క్షేత్ర పాలకుడుగా జనార్దనస్వామి ఉన్నారు. ఈ ఆలయ ప్రాంగణంలో వినాయకుడు, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, కుమారస్వామి, కనకదుర్గాదేవి, నవగ్రహాలు, కాలభైరవ స్వామి, శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీదేవి, చండీశ్వరుడు, లింగాకారంలో సూర్యనారాయణ మూర్తి, పార్వతీదేవి, శ్రీ, భూ సమేత సత్యనారాయణస్వామి, సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఉపాలయాల్లో కొలువుదీరారు.

వాడపాలెం, కొత్తపేటలో ప్రసిద్ధ ఆలయాలు

కొత్తపేట: సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మండలంలోని వాడపాలెం, కొత్తపేట శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి క్షేత్రాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకూ వివిధ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. స్థల పురాణం ప్రకారం వాడపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరుడు స్వయంభువుగా వెలిశాడు. ఇక్కడి స్వామివారిని మొక్కుకుంటే తొందర్లోనే వివాహం జరుగుతుందని, సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. భక్త రామదాసు మేనమామలైన అక్కన్న, మాదన్నలు నిర్మించిన కొత్తపేట హరిహర దేవాలయాల ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పూర్వం నుంచీ స్వయంభువుగా కొలుస్తారు. ఆలయ ప్రధానార్చకుడు, భక్త కమిటీ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు.

షష్ఠి తీర్థానికి ఏర్పాట్లు

అంబాజీపేట: సుబ్రహ్మణేశ్వరస్వామి షష్ఠి తీర్థాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు భక్తులు సహకరించాలని ఆలయ ధర్మకర్త గోకవరపు సత్యనారాయణమూర్తి, సత్తిపండురాజు, సాయి, ప్రభాకర్ కోరారు. మాచవరంలో వేంచేసియున్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఏర్పాట్లను, బారికేడ్లను ధర్మకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామి కల్యాణం ఘనంగా జరిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

మామిడికుదురు: మార్గశిర శుద్ధ పంచమి శుభ ముహూర్తంలో శుక్రవారం రాత్రి సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ కల్యాణోత్సవాన్ని ఆద్యంతం కమనీయంగా నిర్వహించారు. మొగలికుదురు, పాశర్లపూడిబాడవ, పెదపట్నం, బి.దొడ్డవరం, అప్పనపల్లి, ఆదుర్రు, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండుగలా జరిపించారు. బి.దొడ్డవరం గ్రామంలోని ఆలయంలో గుత్తుల వెంకటేశ్వరరావు, లీలా నాగదుర్గ, నాగభూషణం, వీరవెంకటరుక్మిణిశ్రీదేవి దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణోత్సవం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో జరిగిన కల్యాణోత్సవంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఆయా ఆలయాల వద్ద అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

రావులపాలెం: మండలంలోని ఊబలంక, రావులపాలెం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి



వాడపాలెంలో స్వయంభువు సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆలయాల్లో శుక్రవారం రాత్రి స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొని కళ్యాణం జరిపించారు. వేద పండితుల సమక్షంలో జరిగిన స్వామివార్ల కల్యాణాన్ని స్థానికులు తిలకించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



వేంకటేశ్వరస్వామికి నిర్వహిస్తున్న కల్యాణోత్సవం

అయినవిల్లి: నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామికి శుక్రవారం వైభవంగా కల్యాణం జరిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ వేడుకకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వీక్షించారు. స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా హుస్సేన్

మామిడికుదురు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా నగరం గ్రామానికి చెందిన ముకరం హుస్సేన్‌ను నియమించారు. తనను వక్ఫ్ బోర్డు సభ్యుడిగా నియమించారని ముకరం హుస్సేన్ శుక్రవారం తెలిపారు. తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ నజీర్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అమలాపురంలో ఆర్చరీ పోటీలకు ఏర్పాట్లు



ఆర్చరీ జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ

రాజోలు: జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి అమలాపురంలో ఆర్చరీ పోటీలు జరుగుతాయని జిల్లా అధ్యక్షుడు జొన్న లగడ్డ గోపాలకృష్ణ తెలిపారు. సర్ సీవీ రామన్ పాఠశాలలో రవణం రాంబాబు మెమోరియల్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 2007 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టిన బాల, బాలికలు పోటీలకు అర్హులన్నారు. సబ్ జూనియర్ ఆర్చరీ బాల, బాలికలు చాంపియన్‌షిప్‌తో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు జరుగుతాయన్నారు. జిల్లా కార్యదర్శి పి.లక్ష్మణ్ 9989001161 నంబర్‌కు ఫోన్ చేసి ఆటగాళ్ల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

మాలల మహాగర్జనను విజయవంతం చేయండి

అయినవిల్లి: డిసెంబర్ 15న గుంటూరులోని నల్లపాడులో జరిగే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని అయినవిల్లి మండల మాలమహానాడు అధ్యక్షుడు గిడ్ల వెంకటేశ్వరరావు శుక్రవారం పిలుపునిచ్చారు. ముక్తేశ్వరం సెంటర్‌లో జిల్లా మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో అయినవిల్లి మండల మాల మహానాడు జేఏసీ కమిటీ సమక్షంలో చలో గుంటూరు కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల వారోత్సవాలు

పి.గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం వద్ద అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రానందం మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు బహుమతులు అందించి, కేకు కట్ చేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భవిత కేంద్రంలో పిల్లలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓలు

బీబీ ఫాతెమా జహెరాకు ఘన నివాళి

మామిడికుదురు: ఇస్లాం మత వ్యవస్థాపకుడు, మహ్మద్ ప్రవక్త తనయురాలు బీబీ ఫాతెమా జహెరా షహదత్ మజ్లిస్ శుక్రవారం పాశర్లపూడి దర్గా వద్ద ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది ముస్లింలు దర్గా వద్ద జరిగిన మజ్లిస్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఏకైక దర్గాగా ప్రాచుర్యం పొందిన దర్గా వద్ద భారీగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏటా ముస్లిం క్యాలెండర్‌లోని 'ఆఖర్' నెల మూడో తేదీన ఫాతెమా జహెరా షహదత్‌ను నిండు శోకంతో నిర్వహించడం ఆనవాయితీ. కేవలం మహిళలకు మాత్రమే ఈ దర్గా లోపలికి ప్రవేశం ఉంది. పురుషులు, గర్భిణులు దర్గా వెలుపల నుంచే మజ్లిస్, ప్రార్థనల్లో పాల్గొన్నారు. దర్గాను దర్శించుకున్న మహిళలు ముడుపులు, మొక్కులు చెల్లించారు. భక్తులకు స్థానిక ముస్లిం సంఘాలు అన్నసమారాధనతో పాటు ఇతర వసతి ఏర్పాట్లు చేశాయి.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మామిడికుదురు: రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీల్లో ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 8వ తరగతి విద్యార్థి యెరుబండి శ్రీపాలాముఖేష్, పదో తరగతి విద్యార్థి లంకలపల్లి గణేష్ చరణ్ ప్రతిభ చూపారు. కోనసీమ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన ఈ విద్యార్థులకు అమలాపురంలో శుక్రవారం జరిగిన సమావేశంలో డీఈఓ సలీమ్ బాషా సైకిళ్లను అందించి వారిని అభినందించారు. క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

క్విజ్ పోటీల్లో ముక్తేశ్వరం విద్యార్థుల ప్రతిభ

అయినవిల్లి: అమలాపురంలో శుక్రవారం జరిగిన రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ క్విజ్ 2024 పోటీల్లో ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ క్విజ్ పోటీల్లో మానేపల్లి సాయి ఆశ్రిత, బొక్కా యశ్విన్‌లు తృతీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న డీఈఓ సలీంబాషా

ఆరుబయట చెత్త వేస్తే చర్యలు తప్పవు

రామచంద్రపురం: ఇంటికి వచ్చిన పారిశుధ్య కార్మికులకు మాత్రమే ఇంటి వద్దే చెత్తను అందించాలని ఎక్కడ పడితే చెత్తను వేయరాదని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన శుక్రవారం ఉదయం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఎక్కడా చెత్త వేయరాదని ఆరుబయట మల విసర్జనను చేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజల సహకారంతో గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. వార్డు శానిటరీ సెక్రటరీలు నిత్యం పర్యవేక్షిస్తూ వార్డులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- గ్రామగ్రామాన వర్ధంతి కార్యక్రమాలు
- నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, నాయకులు

పి.గన్నవరం: మహనీయుల అడుగుజాడల్లో అందరూ పయనించి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోట విజయభాస్కర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర మాలల జేఏసీ కో కన్వీనర్ కోట రామ్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గిడ్డి మాట్లాడారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సాధనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: బీఆర్ అంబేడ్కర్ దేశం గర్వించదగ్గ నాయకుడే కాక, ప్రపంచ దేశాలకు స్ఫూర్తి దాయకుడని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్, పంచాయతీ పార్కులో అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే బండారు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ఆ పార్టీ దళిత నాయకులు బూసి విష్ణుమూర్తి, బీర ఇస్సాక్, జనసేన నాయకుడు పల్లికొండ సుదీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ గంగాధరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు, పలువురు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మలికిపురం: అంబేడ్కర్ విధానాలను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని మలికిపురం వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. గొల్లపల్లి సూర్యరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాటీ శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, కట్ట శ్రీనివాస్, సర్పంచ్ గెడ్డం తులసి భాస్కర్, చెల్లింగి ఈశ్వరి, సీతామహాలక్ష్మి, నల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకమని రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పలువురు అన్నారు. శుక్రవారం రాజోలు బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, కార్యదర్శి గొల్లమందల స్టాలిన్ తదితర న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజోలు అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, సర్పంచ్‌లు రేవు జ్యోతి, కుక్కల బేబికుమారి, మెడబల రాజ్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సఖినేటిపల్లి: అంబేడ్కర్‌ను ప్రపంచ దేశాల్లో మేధావిగా గుర్తించడం భారతదేశానికే గర్వకారణమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ వర్ధంతిలో ఆయన నిలువెత్తు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

అంబాజీపేట: బీఆర్ అంబేడ్కర్ ఆశయం ఎంతో గొప్పదని, ఆ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు అధ్యక్షతన అంబేడ్కర్ వర్ధంతి వేడుకను శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, పుల్లేటికుర్రులో తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని, అతను దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శ్లాఘించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మామిడికుదురు బస్టాండ్ సెంటర్లోని విగ్రహానికి శుక్రవారం ఎమ్మెల్యేతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలో కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నేతలు, ఎస్సీ సంఘాలు, కాంగ్రెస్ పార్టీ, పలు దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

అయినవిల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ముక్తేశ్వరం సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎస్టీయూ నాయకులు జె.భీమారావు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీడీఓ డి.రాంబాబు, ఎంపీడీఓ జి.భీమారావు, ఈఓపీఆర్డీ వాణికుమారి బెహరాలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రావులపాలెం: యువత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అడుగు జాడల్లో ముందుకు సాగాలని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రావులపాలెం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ వర్ధంతిని ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీఓ ఎ.మహేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



సఖినేటిపల్లి సమతా కల్యాణ మండం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



మలికిపురం పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



పి.గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



రావులపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి